మెగా డబుల్ కామెడీ ట్రీట్?

చిరంజీవికి ద్విపాత్రాభినయాలు కొత్తేం కాదు. అప్పుడెప్పుడో 'నకిలీ మనిషి' నుంచి ఎనిమిదేళ్ల క్రితం వచ్చిన 'ఖైదీ నంబర్ 150' వరకూ ఓ పదకొండు సినిమాల్లో ఆయన ద్విపాత్రాభినయం చేశారు. ఇప్పుడిందంతా దేనికంటే.. మళ్లీ ఆయన రెండు పాత్రలతో తెరపై మెరవనున్నట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేయనున్నారు చిరంజీవి. ఈ సినిమాలో మెగాస్టార్ డ్యూయెల్ రోల్ చేయనున్నారట. ఈ రెండు పాత్రలూ దేనికదే విభిన్నంగా ఉంటాయట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. అనిల్ టీమ్ స్క్రిప్ట్‌ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. చిరంజీవి ఇమేజ్‌కి తగ్గట్టుగా అనిల్ మార్క్ కామెడీతో ఈ స్క్రిప్ సిద్ధం అవుతున్నదట. ఈ కథకు చిరంజీవి కూడా బాగా కనెక్ట్ అయ్యారని తెలుస్తున్నది. చాలాకాలం తర్వాత చిరంజీవి చేస్తున్న గొప్ప కామెడీ సినిమా ఇదని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి కామెడీ సెన్స్‌కి అనిల్ కామెడీ తోడైతే థియేటర్లలో నవ్వుల వరదే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్టీఆర్ సినిమాలో ఛాన్స్?

బాలీవుడ్ గ్లామర్‌క్వీన్ ఊర్వశి రౌతేలా ప్రత్యేక గీతాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైంది. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాలో కూడా ఓ హుషారైన పాటలో నర్తించింది. ఇప్పటివరకు గ్లామర్ నాయికగానే తెలుగు ప్రేక్షకుల్లో ముద్రపడిపోయిన ఈ భామ పర్‌ఫార్మెన్స్ ప్రధానమైన పాత్రలపై దృష్టిపెడుతున్నదట. ఈ నేపథ్యంలో ఆమె ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ సినిమాలో కీలక పాత్రను పోషించే అవకాశం దక్కించుకుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. భారీ యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో కథానుగుణంగా పవర్‌ఫుల్ ఫీమేల్ రోల్ ఉందట. ఈ పాత్రలో ఊర్వశీ రౌతేలాను ఎంపిక చేశారని సమాచారం. ఈ వార్త నిజమైతే ఊర్వశి రైతేలాకు కెరీర్ పరంగా మంచి బ్రేక్ దొరికినట్లేనని ఫిల్మ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. త్వరలో ఈ సినిమా షూట్‌లో ఊర్వశి జాయిన్ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఎన్టీఆర్–ప్రశాంత్‌నీల్ చిత్రానికి 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

ఇంతకంటే చెప్పొద్దు!

దక్షిణభారత సినిమా అభివృద్ధి, ప్రపంచ మార్కెట్‌పై దాని ప్రభావం.. అనే అంశంపై చర్చించేందుకు ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు విశ్వనటుడు కమల్‌హాసన్, త్రిష, తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్. ఫిల్మ్ మేకింగ్, డిజిటల్ ప్రవర్తన, కథ చెప్పడం, ఆధునిక యుగంలో వినోదం, వ్యాపార విధానాలు.. తదితర అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించారు. చర్చాగోష్ఠి అనంతరం ఏర్పాటు చేసిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో కమల్‌కి ప్రేక్షకుల నుంచి ప్రశ్నలెదురయ్యాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'థగ్‌లైఫ్' సినిమా గురించి ప్రశ్నించగా, 'ఆ సినిమాలో రంగరాజ్ శక్తివేల్ నాయగర్ అనే గజదొంగ పాత్రలో నటించాను. మంచి, చెడు మిశ్రమం ఆ పాత్ర. అసలు రంగరాజ్ శక్తివేల్ ధృక్పథం ఏంటన్నదానిపైనే కథ అంతా ఆధారపడి ఉంటుంది. ఇంతకంటే ఎక్కువ ఓపెనైతే మణిరత్నం నన్ను క్వశ్చన్ చేస్తాడు. అందుకే.. ఈ సమాధానాన్ని ఇక్కడితో ఎడిట్ చేస్తున్నా. ఈ ఎడిటింగ్ ప్రక్రియ కాస్త ఇబ్బందిగానే ఉంది.' అంటూ చమత్కరించారు కమల్. లొకేషనంతా నవ్వులతో నిండిపోయాయి.

రెట్టింపు వినోదం ఖాయం

'మ్యాడ్' చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఆద్యంతం చక్కటి వినోదంతో ఆకట్టుకుంది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రానుంది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు నటించిన ఈ చిత్రానికి కల్యాణ్ శంకర్ దర్శకుడు. మార్చి 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. నలుగురు మిత్రబృందం చేసే అల్లరి, హంగామాతో టీజర్ ఆసాంతం వినోదభరితంగా సాగింది. పంచ్‌డైలాగ్‌లు కడుపుబ్బా నవ్వించాయి. తొలిభాగంతో పోల్చితే సీక్వెల్ రెట్టింపు వినోదంతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని, ఇప్పటికే విడుదలైన 'లడ్డుగానీ పెళ్లి' 'స్వాతి రెడ్డి..' అనే పాటలు బాగా పాపులర్ అయ్యాయని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాతలు: హారిక సూర్యదేవర, సాయిసౌజన్య, సమర్పణ: సూర్యదేవర నాగవంశీ, దర్శకత్వం: కల్యాణ్‌శంకర్.

ఫస్ట్ షో పడ్డాకగానీ రేంజ్ తెలియదు

'మజాకా' వందశాతం హిట్ ఫిల్మ్. దాని రేంజ్ ఏంటి అనేది మాత్రం ఫస్ట్ షో పడ్డాకగానీ డిసైడ్ అవ్వదు. ఇప్పటివరకూ చూసినవారంతా సినిమా సూపర్ అన్నారు. నిర్మాతలు ఉన్నంతలో బెస్ట్ ఎఫర్ట్ పెట్టారు. ఈ మహాశివరాత్రికి కచ్చితంగా మంచి హిట్ అందుకోబోతున్నాం.' అని దర్శకుడు త్రినాథ రావు నక్కిన అన్నారు. ఆయన దర్శకత్వంలో సందీప్‌కిషన్ హీరోగా రూపొందిన చిత్రం 'మజాకా'. రీతూ వర్మ కథానాయిక. రావురమేష్, అన్షూ కీలక పాత్రధారులు. రాజేష్ దండా నిర్మాత. బుధవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు త్రినాథరావు నక్కిన. 'రైటర్ ప్రసన్న 'ధమాకా' టైమ్‌లో ఈ కథ చెప్పాడు. రావురమేష్‌ని దృష్టిలో పెట్టుకొని కథ చెప్పడంతో హీరోగా ఎవరు చేస్తారు? అనడిగాను. అన్నట్టుగానే ఈ కథ చాలామంది దగ్గరకు తిరిగింది. చివరకు రావురమేష్ కాంబినేషన్లోనే సందీప్‌తో ఖాయమైంది. నిజానికి ఈ కథని సందీప్‌కిషన్ ఒప్పుకోవడం గ్రేట్.' అని చెప్పారు త్రినాథరావు. 'ఇది ఓ తండ్రీకొడుకుల కథ. ఫుల్ ఫన్ జోన్‌లో ఉంటుంది. చివరి 20నిమిషాలు మాత్రం ఎమోషనల్‌గా ఉంటుంది. ఈ సినిమా బౌండ్ స్క్రిప్ట్‌తో వచ్చాడు ప్రసన్న. లొకేషన్‌లో చిన్నచిన్న డైలాగ్ మార్పులు తప్ప.. ఇక అందులో వేలు పెట్టలేదు.' అని త్రినాథరావు తెలిపారు. సందీప్‌కిషన్, రావురమేష్, రీతూవర్మ, అన్షూ.. తమ పాత్రలకు ప్రాణం పోశారని, ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై హైప్ తీసుకొచ్చిందని, సాంకేతికంగా కూడా సినిమా నెక్స్ట్ లెవల్లో ఉంటుందని త్రినాథరావు చెప్పారు. ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఉందని, అందుకే 'డబుల్ మజాకా' అని ఎండింగ్‌లో టైటిల్ వేశామని, అలాగే రవితేజ 'ధమాకా'ను కూడా 'డబుల్ ధమాకా'గా సీక్వెల్ చేస్తే బావుంటుందని, ఆ ప్రయత్నంలోనే ఉన్నానని త్రినాథరావు చెప్పారు.

వసంత గీతాలు

భారీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీమూవీ మేకర్స్ నుంచి వస్తున్న కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీ '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. ఇందులో శుద్ధి అయోధ్యగా 'మ్యాడ్'ఫేం అనంతిక సునీల్ కుమార్ లీడ్‌రోల్ చేస్తున్నది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్, గ్లింప్స్, టీజర్‌ని విడుదల చేశారు. మార్చి 3న సినిమాలోని తొలి పాటను విడుదల చేయనున్నారు. 'అందమా.. అందమా..' అంటూ సాగే ఈ పాటను వనమాలి రాయగా, హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచి, అవని మల్హార్‌తో కలిసి ఆలపించారు. ఈ పాట అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ బావుంది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాలో హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా, స్వరాజ్ రెబ్బాప్రగడ, సమీరా కిశోర్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: విశ్వనాథ్ రెడ్డి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్.

'పఠాన్-2' కోసం..

బాలీవుడ్‌లో హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు షారుఖ్‌ఖాన్, దీపికాపడుకోన్. వీరిద్దరి కలయిలో వచ్చిన 'పఠాన్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారు నిర్మాత ఆదిత్య చోప్రా. యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కనున్న ఈ సీక్వెల్ కోసం స్క్రిప్ట్ సిద్ధమవుతున్నదని, ఇందులో కూడా దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తుందని ఆదిత్యచోప్రా తెలిపారు. 'వచ్చే ఏడాది ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొస్తాం. ఇంకా దర్శకుడెవరో నిర్ణయించలేదు. 'పఠాన్' కథకు కొనసాగింపుగా రానున్న ఈ సీక్వెల్‌లో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి' అని ఆదిత్య చోప్రా వెల్లడించారు. 'పఠాన్' సినిమా దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఇతర ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటం వల్ల సీక్వెల్ కోసం మరో దర్శకుడ్ని అన్వేషిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం షారుఖ్‌ఖాన్ 'కింగ్' చిత్రంలో నటిస్తున్నారు. వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.

పల్లెటూరి అమ్మాయి పాత్రలో..

గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా తథాస్తు క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నది. శివ వరప్రసాద్ దర్శకుడు. తాటి బాలకృష్ణ నిర్మాత. ఈ సినిమా ద్వారా భైరవి తెలుగు తెరకు కథానాయికగా పరిచయమవుతున్నది.

ఇందులో ఆమె పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటిస్తున్నది. రొమాంటిక్ కామెడీ చిత్రమిదని, పల్లెటూరి అమ్మాయి పాత్రలో భైరవి చక్కగా ఒదిగిపోయిందని, ఆమె నటనకు మంచి ప్రశంసలు లభిస్తాయనే నమ్మకం ఉందని నిర్మాత తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలో టైటిల్, రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యశ్వంత్.

లింగుస్వామి భారతం?

దర్శకుడు లింగుస్వామి అనగానే 'పందెంకోడి' సినిమా గుర్తొస్తుంది. ఆ తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'ఆవారా' కూడా బాగానే ఆడింది. ఆ మాధ్య హీరో రామ్ పొతినేనితో 'వారియర్' అనే సినిమా కూడా చేశారాయన. ప్రస్తుతం ఆయన నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వినిపిస్తున్నది. 'మహాభారతం'లోని ఓ మహావీరుడి చరిత్రను ఆయన తెరకెక్కించనున్నారట. 700వందల కోట్ల భారీ బడ్జెట్‌లో పానిండియా స్థాయిలో ఈ సినిమా ఉంటుందని సమాచారం. ఇందులో టాలీవుడ్‌కి చెందిన హీరో నటిస్తారని టాక్. మరి ఈ సినిమాను నిర్మించేదెవరో, ఆ హీరో ఎవరో? 'మహాభారతం'లోని ఆ మహావీరుడు ఎవరో? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరకాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

వినూత్న ప్రయోగం 'రా రాజా'

నటీనటుల ముఖాలు చూపించకుండా కేవలం కథ, కథనాలు ప్రధానంగా ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన చిత్రం 'రా రాజా'.శ్రీపద్మిని సినిమాస్ పతాకంపై బి.శివప్రసాద్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 7న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఈ సినిమా పోస్టర్‌ను నటుడు జేడీ చక్రవర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ముఖాన్ని చూపించకుండా ప్రేక్షకుల్ని భయపెట్టడం మామూలు విషయం కాదని, కొత్త కాన్సెప్ట్‌తో సినిమా తీశారని యూనిట్‌ను అభినందించారు. సూపర్‌నాచురల్ థ్రిల్లర్ కథాంశమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ్, సంగీతం: శేఖర్‌చంద్ర, దర్శకత్వం: బి.శివప్రసాద్.

18కోట్ల రుణమాఫీ వివాదం

కేరళ కాంగ్రెస్‌తో ప్రీతిజింటా క్లాష్

న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ అవినీతి కుంభకోణం నేపథ్యంలో కేరళ కాంగ్రెస్ పార్టీ తనపై చేసిన ఆరోపణలను బాలీవుడ్ నటి ప్రీతిజింటా ఖండించింది. బీజేపీ పార్టీకి మద్దతుగా నిలిచినందుకు ప్రతిఫలంగా న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ప్రీతిజింటా తీసుకున్న 18కోట్ల రుణాన్ని బీజేపీ మాఫీ చేసిందని కేరళ కాంగ్రెస్ సోషల్‌మీడియా వేదికగా ఆరోపణలు చేసింది. బ్యాంక్ ఖాతాదారులు తమ డబ్బుల కోసం రోడ్లపైకి వస్తుంటే, ప్రీతిజింటా మాత్రం తన సోషల్‌మీడియా అకౌంట్లను బీజేపీకి అప్పగించి రుణాన్ని మాఫీ చేయించుకుందని కేరళ కాంగ్రెస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. వీటిపై ప్రీతిజింటా తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా స్పందించింది. పదేళ్ల క్రితమే తాను ఆ లోన్ మొత్తాన్ని చెల్లించానని, కేరళ కాంగ్రెస్ తనపై దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడింది. 'ఓ రాజకీయ పార్టీ నా ఫొటోలను ఉపయోగిస్తూ ఇలాంటి అబద్ధపు ప్రచారానికి దిగడం నన్ను షాక్‌కు గురిచేసింది. నా సోషల్‌మీడియా అకౌంట్లను నేనే చూసుకుంటాను. ఇలాంటి ఫేక్ ప్రచారాన్ని మానుకోండి. పదేళ్ల క్రితమే 18 కోట్ల లోన్‌ను చెల్లించాను. ఎలాంటి వివాదానికి ఆస్కారం లేకుండా నా పోస్ట్ అందరి సందేహాలను నివృత్తి చేస్తుందని భావిస్తున్నా' అని ప్రీతిజింటా ఎక్స్ ఖాతాలో పేర్కొంది. ఆమె పోస్ట్‌పై కేరళ కాంగ్రెస్ ప్రతిస్పందించింది. రుణమాఫీ విషయంలో తమ వ్యాఖ్యలు తప్పయితే సరిదిద్దుకుంటామని తెలిపింది.